నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 29-3-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 198 | పేజీలు:4 | వెల: రూ.1/-

## ఇంటింటికీ రేషన్ డెలివరీ పథకానికి కేంద్రం మోకాలడ్డు : కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మార్చి 28:పంజాబ్‌లో భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆప్ సర్కార్ ఇంటింటికీ రేషన్ డెలివరీ పథకాన్ని ప్రారంభించడంపై ఢిల్లీ సీఎం, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ తరహా పథకానికి కేంద్రం మోకాలడ్డుతోందని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కేజ్రీవాల్ మండిపడ్డారు. ఢిల్లీలో తమ ప్రభుత్వం తొలుత దేశ రాజధానిలో ఈ పథకాన్ని అమలు చేయాలని కోరుకున్నా కేంద్రం అడ్డుపడిందని దుయ్యబట్టారు.

ఢిల్లీ తర్వాత పంజాబ్‌లో కొలువుతీరిన ఆప్ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పంపిణీ పథకాన్ని సోమవారం ప్రకటించారని, ఈ పథకం అక్కడ త్వరలోనే అమలవుతుందని స్పష్టం చేశారు. గత నాలుగేండ్లుగా ఢిల్లీలో ఈ పథకాన్ని అమలు చేసేందుకు తాము పలు అడ్డంకులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. తాము ఈ పథకం అమలుకు సన్నద్ధమైనా కేంద్రం అడ్డుకుందని ఆరోపించారు.పంజాబ్‌లో ఈ పథకాన్ని తాము అమలు చేస్తామని దీంతో మిగిలిన రాష్ట్రాలు ఈ పథకాన్ని డిమాండ్ చేస్తాయని చెప్పారు. మొహల్లా క్లినిక్‌ల తరహాలో ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయవచ్చని అన్నారు. ఇక పంజాబ్‌లో రేషన్ డెలివరీ పథకాన్ని ప్రకటిస్తూ భగవంత్ మాన్ పేదలకు ఈ పథకం మేలు చేస్తుందని చెప్పారు. రేషన్ కోసం ఇక పేదలు క్యూల్లో నిల్చోవాల్సిన అవసరం ఉండదని వారి ఇంటికే సరుకులను చేరవేస్తామని తెలిపారు.

## రంజాన్‌కు సకాలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి : మంత్రి తలసాని



హైదరాబాద్, మార్చి 28:ముస్లీం సోదరులు ఎంతో పవిత్రంగా నిర్వహించుకొనే రంజాన్ కు అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మాసాబ్ ట్యాంక్ లోని తన కార్యాలయంలో జీహెచ్ఎంసీ, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్, హార్టికల్చర్ తదితర శాఖల అధికారులు, సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని మసీదు కమిటీ సభ్యులతో రంజాన్ ఏర్పాట్ల పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ? రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా అన్ని ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. గత రెండు సంవత్సరాల నుండి కరోనా మహమ్మారి కారణంగా నిర్వాహించుకోలేక పోయారన్నారు. ఈ సంవత్సరం రంజాన్ ఒక్క పొద్దులు ( రోజా) ఏప్రిల్ 2 లేదా 3 వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయని, కేవలం 4, 5 రోజుల వ్యవధి మాత్రమే ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఏర్పాట్లు చేయాలన్నారు. నెల రోజుల పాటు జరిగే ఒక్క పొద్దుల సందర్భంగా ముస్లీం సోదరులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మసీదు కమిటీ సభ్యుల నుండి వచ్చే పిర్యాదులపై సకాలంలో స్పందించి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. మసీదుల పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, చెత్త, తదితర వ్యర్ధాలను ప్రతిరోజు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ లు అత్తిలి అరుణ గౌడ్, నామన శేషుకుమారి, ఆకుల రూప, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డీఎంసీలు వంశీ, ముకుంద రెడ్డి, వాటర్ వర్క్స్ ఈఎస్సీ కృష్ణ, సీజీ?ం ప్రభు, హార్టికల్చర్ డీడీ లు శ్రీనివాస్, శ్రీదేవి, ఎలక్ట్రికల్ డీఈ లు మహేష్ కుమార్, సుదీర్ కుమార్, ఏఎంఓహెచ్ ప్రవీణ్, మసీదు కమిటీ సభ్యులు సిరాజ్, ఫహీం, దావూద్ రషీద్, యాసిన్, నజీర్, జావేద్, అఖిల్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## తటస్థంగా ఉంటాం: జెలెన్‌స్కీ

కీవ్, మార్చి 28:: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్‌స్కీ.. రష్యా జర్నలిస్టులకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఒకవేళ యుద్ధం ఆగిపోతే తాము తటస్థంగా ఉండేందుకు సిద్ధంగా ఉన్నట్లు జెలెన్‌స్కీ అన్నారు. కానీ దీని కోసం సెక్యూర్టీ గ్యారెంటీ ఇవ్వాలన్నారు. శాంతి ఒప్పందంలో భాగంగా తాము తటస్థంగా ఉండేందుకు అంగీకరిస్తామని జెలెన్‌స్కీ అన్నారు. ఒకవేళ తటస్థ వైఖరికి అంగీకరిస్తే, అప్పుడు తాము నాటోలో చేరబోమని ఉక్రెయిన్ అధ్యక్షుడు స్పష్టం చేశారు. సుమారు 90 నిమిషాల పాటు వీడియో కాల్‌లో జెలెన్‌స్కీ పాల్గొన్నారు. అయితే థార్డ్ పార్టీలు తమకు హామీ ఇస్తే, అప్పుడు తాము తటస్థంగా ఉండబోనున్నట్లు ఆయన చెప్పారు. దీని కోసం రిఫరెండం కూడా నిర్వహించాలన్నారు.


తటస్థంగా ఉండడం అంటే, ఇక ఉక్రెయిన్ నాటోలో చేరబోదని అర్థం. ఆ కూటమికి ప్రస్తుతం ఆ దేశం దూరంగా ఉన్నట్లు లెక్క. వాస్తవానికి రష్యా ఆక్రమణ చేపట్టడానికి ఇదే ముఖ్య కారణం కూడా. ఉక్రెయిన్ ఒకవేళ తటస్థంగా ఉండాలనుకుంటే అప్పుడు పశ్చిమ దేశాలు తమకు సపోర్ట్ ఇవ్వాలన్నారు. ఫిబ్రవరి 24వ తేదీకి ముందు రష్యా బలగాలు ఎలా ఉన్నాయో అలాంటి చోటుకే మళ్లీ వెళ్లాలన్నారు. జెలెన్‌స్కీ చేసిన ప్రతిపాదనకు రష్యా అంగీకరించడం కష్టంగానే కనిపిస్తోంది. ఉక్రెయిన్ దక్షిణ, తూర్పు భాగాల్లో ఇప్పటికే రష్యా పూర్తి ఆధిపత్యాన్ని చాటింది. ఈ దశలో జెలెన్‌స్కీ విధించిన షరతుకు రష్యా ఒప్పుకుంటుందో లేదో చెప్పలేం.

రాజ్యాంగంలోనూ మార్పులు చేపట్టాలని జెలెన్‌స్కీ అన్నారు. ఇలా చేయాలంటే మరో ఏడాది కాలం పడుతుందన్నారు. మరి పుతిన్ అంత కాలం వేచి ఉండగలరా అన్నది మరో ప్రశ్న. తటస్థ వైఖరి కోసం ప్రజాభిప్రాయ సేకరణతో పాటు రాజ్యాంగపరమైన మార్పులు అవసరం అన్నారు. నెల రోజుల యుద్ధం తర్వాత తటస్థంగా ఉండేందుకు జెలెన్‌స్కీ పెట్టిన ప్రతిపాదన నిజానికి ఆశ్చర్యమే. ఎందుకంటే నాటోలో చేరవద్దు అని ముందే పుతిన్ హెచ్చించారు. ఆ షరతును కాదని జెలెన్‌స్కీ ప్రవర్తించారు. ఇప్పుడు తీవ్ర నష్టం జరగడంతో తటస్థ వైఖరికి మొగ్గుచూపడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. రెండు దేశాల ప్రతినిధుల మధ్య తాజాగా టర్కీలో జరగనున్న చర్చలతో తటస్థ వైఖరిపై ఓ క్లారిటీ రానున్నది.

## టీఎస్ ఎంసెట్-2022 నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, మార్చి 28: టీఎస్ ఎంసెట్–2022 నోటిఫికేషన్‌ను ఎంసెట్ కన్వీనర్ గోవర్ధన్ విడుదల చేశారు. ఏప్రిల్ 6 నుంచి మే 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారమని కన్వీనర్ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులు రూ. 400, మిగతా కేటగిరిల అభ్యర్థులు రూ. 800 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ తెలిపారు. ఇంజినీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్ష రాసే ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులు రూ. 800, మిగతా కేటగిరిల అభ్యర్థులు రూ. 1600 చెల్లించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అగ్రికల్చర్, మెడికల్ పరీక్షను జూన్ 14, 15వ తేదీల్లో, నిర్వహిస్తామన్నారు. ఇంజినీరింగ్ ఎగ్జామ్‌ను 18, 19, 20వ తేదీల్లో నిర్వహిస్తామని కన్వీనర్ పేర్కొన్నారు.


### చరిత్రలో నేటినిజం



కం॥ రేడియము లుక్కు నకు-క
స్టేడియమున వెలుగు ఘనుని స్తోత్రము జేయున్
స్టేడియమై, క్రికెట్టుకు
స్టేడియమై నిలచినట్టి "చిన్నస్వామి"న్ !!

(మార్చి 29 కన్నడ క్రికెటర్ చిన్నస్వామి జయంతి…)

–రాధశ్రీ
సెల్: 9494481210



## దివ్య విమాన గోపురంపై శ్రీ సుదర్శన చక్రానికి సీఎం కేసీఆర్ జలాభిషేకం



హైదరాబాద్, మార్చి 28:యాదాద్రిలో మహా కుంభ సంప్రోక్షణ మహోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. దివ్య విమాన గోపురంపై శ్రీ సుదర్శన చక్రానికి సీఎం కేసీఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించారు. సీఎం కేసీఆర్‌కు కంకణధారణ చేసి పండితులు ఆశీర్వచనం అందించారు. 7 గోపురాలపై ఉన్న కలశాలకు ఏకకాలంలో కుంభాభిషేకం, సంప్రోక్షణ నిర్వహించారు. రాజ గోపురాలపై స్వర్ణ కలశాలకు 92 మంది రుత్వికులతో సంప్రోక్షణ నిర్వహించారు. విమాన గోపురాల శిఖరాలపై కలశ సంప్రోక్షణ కైంకర్యాలు నిర్వహించారు.

మహాకుంభ సంప్రోక్షణ మహోత్సవం తర్వాత ప్రధానాలయ ప్రవేశ కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలుత ఉపాలయాల్లోని ప్రతిష్ఠామూర్తులకు మహాప్రాణన్యాసం చేయనున్నారు. తొలి ఆరాధన సంప్రోక్షణ తర్వాత గర్భాలయంలో స్వయంభువుల దర్శనం ప్రారంభం కానుంది. సంప్రోక్షణ తర్వాత గర్భాలయంలో ప్రథమారాధన, ఆరగింపు చేపట్టనున్నారు. గర్భాలయంలో తీర్థ, ప్రసాద గోష్ఠి నిర్వహించనున్నారు.

ఆధ్యాత్మిక ఉట్టిపడేలా.. మహాకుంభ సంప్రోక్షణ ఘట్టాలు..

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా మహాకుంభ సంప్రోక్షణ ఘట్టాలు.. అర్చకులు, రుత్వికులు, వేదపండితుల ఆధ్వర్యంలో సాగుతున్నాయి. ఉదయం 9:50 గంటలకు ఆలయంలో కవచమూర్తులను, ఉత్సవమూర్తులను ఊరేగింపుగా శోభాయాత్రను ప్రారంభించారు. ఉదయం 10 గంటలకు వీవీఐపీ అతిథి గృహం నుంచి సాంప్రదాయ వస్త్రాలతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాన ఆలయానికి చేరుకున్నారు. 10:05 గంటలకు బాలాలయంలోని తూర్పు ద్వారం గుండా కవచములతో శోభాయాత్ర బయటకు వచ్చింది. ఈ శోభాయాత్రలో ముఖ్యమంత్రి కేసీఆర్ సతీసమేతంగా పాల్గొన్నారు.

10:39 గంటలకు ప్రధానాలయం తూర్పుకు రాజగోపురం ద్వారా ఉత్సవమూర్తులు ఆలయంలోకి ప్రవేశించారు. 10:50 గంటలకు ముఖమండపానికి ఉత్సవమూర్తులు చేరుకున్నారు. 11 గంటలకు విమాన గోపురం, వివిధ రాజ గోపురాలపై అర్చకులు పూజలు ప్రారంభించారు. 11:40 గంటలకు ప్రధానార్చకులు మహాసంకల్పాన్ని ప్రారంభించారు.

11:55 గంటలకు దివ్య విమాన గోపురంపై శ్రీ సుదర్శన చక్రానికి సీఎం కేసీఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించారు. సీఎం కేసీఆర్‌కు కంకణధారణ చేసి పండితులు ఆశీర్వచనం అందించారు. 7 గోపురాలపై ఉన్న కలశాలకు ఏకకాలంలో కుంభాభిషేకం, సంప్రోక్షణ నిర్వహించారు. రాజ గోపురాలపై స్వర్ణ కలశాలకు 92 మంది రుత్వికులతో సంప్రోక్షణ నిర్వహించారు. విమాన గోపురాల శిఖరాలపై కలశ సంప్రోక్షణ కైంకర్యాలు నిర్వహించారు.





## ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉద్యోగులకు అండా వుంటుంది: తలసాని



హైదరాబాద్, మార్చి 28: ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉద్యోగుల కు అండగా ఉంటుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వాటర్ వర్క్స్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా (టీఆర్ఎస్ అనుబంధ సంఘం) ఈ నెల 26 వ తేదీన జరిగిన ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన రాంబాబు యాదవ్ సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను వెస్ట్ మారేడ్ పల్లి లోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్ కు మంత్రి అభినందనలు తెలిపారు. ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి సూచించారు.

## శాస్త్రోక్తంగా ముగిసిన మహాకుంభ సంప్రోక్షణ.. సీఎం కేసీఆర్‌కు ఘనంగా సత్కారం..

యాదాద్రి భువనగిరి, మార్చి 28: : నవ్య యాదాద్రిని ముఖ్యమంత్రి కేసీఆర్ జాతికి పునరంకితం చేశారు. జయజయ ధ్వానాల మధ్య ప్రధాన ఆలయ ప్రవేశం జరిగింది. మహాకుంభ సంప్రోక్షణ క్రతువు శాస్త్రోక్తంగా ముగిసింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ దంపతులను వేద పండితులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. శోభాయాత్ర, విమాన గోపురాలకు పవిత్ర జలాలతో అభిషేకం, ఆలయ ప్రవేశం జరిగిన సమయంలో నమో నారసింహ మంత్రం ప్రతి ధ్వనించింది. ఈ కార్యక్రమంలో సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పలువురు ప్రముఖులు, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణంలో పాలు పంచుకున్న ఆలయ ఈవో ఎన్ గీత, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి, స్థపతి సుందర్ రాజన్, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావును సీఎం కేసీఆర్ శాలువాలతో సత్కరించి, సన్మానించారు.

ఆర్కిటెక్చర్ మధుసూదన్, ఈఎన్సీ రవీందర్ రావు, గణపతిరెడ్డి, శంకరయ్యలను మంత్రి ప్రశాంత్ రెడ్డి, జీ వసంత్ నాయక్, వై లింగారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డిలను మంత్రి జగదీశ్వర్ రెడ్డి, రామారావు, సుధాకర్ తేజలను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి శాలువాలతో సత్కరించి సన్మానించారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆలయ ఈవో గీత, వైటీడీఏ వైస్ చైర్మన్ శాలువాతో సత్కరించి, నారసింహ స్వామి ఫోటోను బహూకరించారు.

## ఘనంగా పద్మ అవార్డుల ప్రదానం.. కృష్ణ ఎల్ల దంపతులకు పద్మభూషణ్.. నీరజ్ చోప్రాకు పద్మశ్రీ



న్యూఢిల్లీ, మార్చి 28: రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల ప్రదానం కార్యక్రమం జరిగింది. క్రీడాకారుడు నీరజ్ చోప్రా, శాస్త్రీయ గాయకుడు ప్రభా ఆత్రే, నటుడు విక్టర్ బెనర్జీ సహా 74 మందికి రాష్ట్రపతి అవార్డులను అందించారు. ఈ సంవత్సరం, 128 పద్మ అవార్డులను కేంద్రం ప్రకటించగా.. తొలి విడుత పంపిణీ కార్యక్రమం ఈ నెల 21న జరిగింది. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కల్యాణ్ సింగ్ (మరణానంతరం), శాస్త్రీయ గాయకుడు ప్రభా ఆత్రేకు పద్మ విభూషణ్, నటుడు విక్టర్ బెనర్జీ, భారత్ బయోటెక్ ఎండీ కృష్ణ ఎల్ల, ఆయన సతీమణి సుచిత్ర ఎల్లా పద్మ భూషణ్ అవార్డులను అందుకున్నారు.

టోక్యో ఒలింపిక్స్ జావెలిన్ త్రో బంగారు పతక విజేత నీరజ్ చోప్రా, టోక్యో పారాలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ షట్లర్ ప్రమోద్ భగవత్, జావెలిని త్రోయర్ సుమిత్ అంటిల్, ప్రముఖ గాయకుడు సోను నిగమ్‌తో పాటు పలువురు ప్రముఖులు రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. అలాగే ఐర్లాండ్‌కు చెందిన ప్రొఫెసర్ రట్జర్ కోర్టెన్‌హోస్ట్‌కు ఐరిష్ పాఠశాలల్లో సంస్కృతానికి ప్రాచుర్యం కల్పించడంలో చేసిన కృషికి సైతం రాష్ట్రపతి పద్మశ్రీ అవార్డును ప్రదానం చేశారు.

ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన వారికి కేంద్రం అవార్డులను ప్రకటిస్తున్నది. ఈ ఏడాది జాబితాలో నాలుగు పద్మవిభూషణ్, 17 పద్మభూషణ్, 107 పద్మశ్రీ అవార్డులను కేంద్రం ప్రకటించింది. 34 మంది మహిళలు, 13 మందికి మరణానంతరం పద్మ అవార్డులు దక్కాయి. అలాగే విదేశీయులతో పాటు పలువురు ప్రవాస భారతీయులను సైతం కేంద్రం పద్మ అవార్డులతో సత్కరించింది.

## నకిలీ సీడ్స్ అంటగట్టిన వ్యాపారి.. పోలీసులకు అడ్డంగా బుక్కయాడు

నిజామాబాద్, మార్చి 28: రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టిన సీడ్స్ వ్యాపారిని పోలీసులు అరెస్టుచేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన యమద్రి భాస్కర్ ను సోమవారం పెర్కిట్ లో అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచినట్లు ఆర్మూర్ రూరల్ సిఐ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. బాల్కొండ పోలీస్ స్టేషన్ లో ఎస్సై కర్తన్ చంద్రమోహన్ తో కలిసి విలేకరుల సమావేశం లో ఆయన వివరాలను వెల్లడించారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన వ్యాపారి యమాద్రి భాస్కర్ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని ఆశతో నకిలీ విత్తనాలను సరఫరా చేసి రైతులను నట్టేట ముంచాడు. కొంత కాలంగా భాస్కర్ ఆర్మూర్, నందిపేట్, బాల్కొండ మండలాల్లో రైతులకు ఎర్రజొన్న, ముల్ల జొన్న విత్తనాలను సరఫరా చేశాడు. వచ్చిన దిగుబడిని కొనుగోలు చేశాడు.

కానీ, తక్కువ సమయంలోనే ఎక్కువ డబ్బును సంపాదించాలని ఆశతో రైతులకు నకిలీ విత్తనాలను తక్కువ ధరకు తీసుకొచ్చి సరఫరా చేశాడు. బాల్కొండ మండలం ఇత్వర్ పెట్ గ్రామానికి చెందిన కొంతమంది రైతులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. రైతులను మోసం చేయడంతో పాటు డబ్బులు అడిగినందుకు తమ దగ్గర పెద్ద పెద్ద మనుషులు ఉన్నారని రైతులను బెదిరించాడని అన్నారు. దీంతో ఆయనపై 3 కేసులు (420, 19, 21 క్లాస్ వన్) సీడ్స్ యక్టు నమోదు చేసి, ఆయన వినియోగిస్తున్న రెండు కార్లను సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు. భాస్కర్ వల్ల మోసపోయిన రైతులు ఇంకా ఎవరైనా ఉంటే సంబంధిత పోలీసులను సంప్రదించాలని రైతులకు సూచించారు.

## హన్మకొండకు గవర్నర్ తమిళిసై రాక.. సాంస్కృతిక ఉత్సవాలకు హాజరు..

వరంగల్, మార్చి 28: రేపు హన్మకొండకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రానున్నారు. కేంద్ర సాంస్కృతిక పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హనుమకొండలో రెండ్రోజుల పాటు జరగనున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో గవర్నర్ పాల్గొననున్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగే ఈ ఉత్సవాలను ఆమె ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమానికి కేంద్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అధ్యక్షత వహించనున్నారు.

## పన్నులు చెల్లించండి.. అభివృద్ధికి సహకరించండి

కరీంనగర్ , మార్చి 28: (నేటినిజం ప్రతినిధి): పెద్దపల్లి పట్టణ ప్రజలంతా పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ తిరుపతికి ఆస్తిపన్ను కోసం 10,80,405 రూపాయల చెక్కును అందజేశారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని ప్రజలందరూ ఈ నెల 31వ తేదీ లోగా ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## సెంట్రల్ మెక్సికోలో కాల్పులు : 19 మంది మృతి

మెక్సికో, మార్చి 28:: సెంట్రల్ మెక్సికోలో జరిగిన కాల్పుల్లో 19 మంది మరణించారని స్టేట్ అటార్నీ జనరల్ కార్యాలయం (ఎఫ్‌జీఈ) ఓ ప్రకటనలో తెలిపింది. మికోకన్ స్టేట్ లాస్ టినజాస్ పట్టణంలో ఆదివారం ఓ ఉత్సవం కోసం గుమికూడిన వారిపై దాడి జరిగిందని అధికారులు పేర్కొన్నారు. ముగ్గురు మహిళలు, 16 మంది పురుషులు సహా 19 మృతదేహాలు లభ్యమయ్యాయని తెలిపారు.

మృతదేహాలపై కాల్పుల గాయాలున్నాయని ఎఫ్‌జీఈ పేర్కొంది. ఈ ఘటనలో పలువురు క్షతగాత్రులను అధికారులు ఆస్పత్రులకు తలరించారు. కాల్పులకు గల కారణాలపై అధికారులు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ఇక మికోకన్, గునజుటో మెక్సికోలోనే అత్యంత హింసాత్మక ఘటనలు చోటుచేసుకునే పట్టణాలుగా గుర్తింపు పొందాయి.

డ్రగ్ ట్రాఫికింగ్ సహా పలు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే ప్రత్యర్థి ముఠాల మధ్య తరచూ ఘర్షణలు తలెత్తుతుంటాయి. 2006లో కేంద్ర బలగాలతో ప్రభుత్వం యాంటీ డ్రగ్ ఆపరేషన్ చేపట్టినప్పటి నుంచి మెక్సికో డ్రగ్ సిండికేట్ మధ్య వార్ జరుగుతోంది. అప్పటినుంచి ఈ ప్రాంతంలో 3,40,000కు పైగా హత్యలు జరగ్గా వీటిలో నేరస్తుల మధ్య ఘర్షణలతోనే అత్యధిక హత్యలు వెలుగుచూశాయని చెబుతారు.

## తెలంగాణలో రానున్న ఐదు రోజులు భగభగలే

హైదరాబాద్, మార్చి 28: భానుడి ప్రతాపం మొదలైంది. మార్చి నెల మొదటి అంకంలోనే ఉష్ణోగ్రతలు పెరిగాయి. మొదటి, రెండో వారాల్లో కాస్త ఉష్ణోగ్రత పెరిగినా.. నెల చివరిలో మాత్రం తారాస్థాయికి చేరాయి. తెలంగాణలో రానున్న ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో 3 డిగ్రీల వరకు వేడి పెరగొచ్చని వాతావరణ కేంద్రం ప్రకటించింది. భానుడి ప్రతాపం ఇప్పుడే తీవ్రతరం కావటంతో ఏప్రిల్, మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళన ప్రజల్లో కనిపిస్తోంది. అత్యధిక ప్రాంతాల్లో ఉదయం 10 గంటలకే సూరీడు సుర్రుమనిపిస్తున్నాడు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకూ మంటపుట్టిస్తున్నాడు. పాఠశాలలు, కార్యాలయాల్లోని ఉద్యోగులు, దుకాణాల్లోని వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు.

## బాలిక హత్య కేసులో దోషులపై కఠిన చర్యలు : సునీతాలక్ష్మారెడ్డి

హైదరాబాద్, మార్చి 28: వికారాబాద్ జిల్లాలో బాలిక హత్య కేసు ఘటనను సుమోటోగా స్వీకరిస్తున్నామని తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ వాకిటి సునీతాలక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. తక్షణమే దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకునే విధంగా కమిషన్ కృషి చేస్తుందన్నారు. ఈ మేరకు కమిషన్ కార్యాలయం సోమవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు.

15 సంవత్సరాల బాలికను హత్య చేయడం దారుణమని, మనుషుల్లో మానవత్వం లోపించి ఇలాంటి ఘటనలు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సహకారంతో నిందితులను గుర్తించి శిక్షించడంతో పాటు బాలిక కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇలాంటి దుండగుల బారీ నుంచి రక్షించబడాలంటే బాలికలు, మహిళలు స్వీయ రక్షణ పద్ధతులు పాటించి ప్రాథమిక రక్షణ పొందాలనిచైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి సూచించారు.

## మతువా ధర్మ మహా మేళాను ఉద్దేశించి మార్చి నెల 29న ప్రసంగించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మార్చి 28:శ్రీ శ్రీ హరిచంద్ ఠాకూర్ జీ 211వ జయంతి సందర్భం లో పశ్చిమ బంగాల్ లో ఠాకూర్ బాడీ లో గల శ్రీధామ్ ఠాకూర్ నగర్ లో మార్చి నెల 29వ తేదీ న మతువా ధర్మ మహా మేళా 2022 ను ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆ రోజు న సాయంత్రం పూట 4:30 గంటల కు వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా ప్రసంగించనున్నారు.

శ్రీ శ్రీ హరిచంద్ ఠాకూర్ జీ తన జీవనాన్ని అణచివేత బారిన పడినటువంటి, అణగారిన వర్గాల కు చెందినటువంటి మరియు ఆదరణ కు నోచుకోనటువంటి వ్యక్తుల శ్రేయస్సు కోసం అంకితం చేశారు.

ఆయన మొదలు పెట్టిన సామాజిక మరియు ధార్మిక ఉద్యమం 1860వ సంవత్సరం లో ఓరాకాండీ (ఇప్పుడు బాంగ్లాదేశ్ లో ఉంది) నుంచి ఆరంభమై, మతువా ధర్మం స్థాపన కు దారి తీసింది.

మతువా ధర్మ మహా మేళా 2022 ను అఖిల భారత మతువా మహాసంఘ ఈ నెల 29వ తేదీ మొదలుకొని ఏప్రిల్ 5వ తేదీ వరకు నిర్వహించనుంది.

## నేడు మధ్య ప్రదేశ్ లో 5 లక్షల మందికి పైగా పిఎమ్ఎవై-జిలబ్ధిదారుల 'గృహ ప్రవేశం' కార్యక్రమం

న్యూఢిల్లీ, మార్చి 28:మధ్య ప్రదేశ్ లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ (పిఎమ్ఎవై–జి) లబ్ధిదారులైన దాదాపు 5.21 లక్షల మంది జరుపుకొనే 'గృహ ప్రవేశం' కార్యక్రమం లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్చి నెల 29వ తేదీన మధ్యాహ్నం 12:30 గంటల వేళ కు వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా పాలుపంచుకోనున్నారు. సభికుల ను ఉద్దేశించి ఈ సందర్భం లో ప్రధాన మంత్రి ప్రసంగించనున్నారు.

దేశం లో లేమి లో ఉన్న ప్రతి ఒక్క కుటుంబాని కి అన్ని మౌలిక సౌకర్యాల తో ఒక పక్కా ఇంటి ని సమకూర్చాలన్నదే ప్రధాన మంత్రి నిరంతర కృషి గా ఉంటూ వస్తోంది. ఈ దిశ లో తాజా కార్యక్రమం మరో అడుగు కానుంది.

ఇదే కార్యక్రమం లో మధ్య ప్రదేశ్ వ్యాప్తం గా కొత్త ఇళ్ళ లో శంఖం, దీపం, పూలు మరియు రంగవల్లుల తో సాంప్రదాయిక వేడుకల ను కూడా నిర్వహించడం జరుగుతుంది.

మధ్య ప్రదేశ్ లో పిఎమ్ఎవై–జి అమలు సందర్భం లో మహిళా తాపీమేస్త్రీ లు సహా వేల కొద్దీ తాపీమేస్త్రీల కు శిక్షణ, ఫ్లయ్ యాష్ ఇటుకల ను ఉపయోగించడం, సెంట్రింగ్ మెటీరియల్ కోసం రుణాల ను ఇవ్వడం ద్వారా మహిళా స్వయంసహాయ సమూహాల (ఎస్ హెచ్ జి స్) సశక్తీకరణ, ప్రాజెక్టు ల పర్యవేక్షణ మరియు ఉత్తమ నిర్వహణ ల కోసం సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించడం వంటి అనేకమైన విశిష్ట మరియు కొత్త కొత్త చర్యల ను తీసుకోవడం జరుగుతోంది.

